



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 178 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : శ్రీకాకుళం | గురువారం 9 జూలై 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 178 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : SRIKAKULAM | THU 9 JULY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

- హాస్టల్లు, గురుకుల విద్యార్థులకు 10 శాతం డైట్ ఛార్జీల పెంపు
- రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు
- ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన
- పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం
- కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన

- మిగతా 2లో

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన

- గత రాత్రి ఇరాన్‌పై భారీ దాడులు నిర్వహించామన్న ట్రంప్
- అవసరమైతే ఈరోజు అదే తరహాలో దాడులు చేస్తామని హెచ్చరిక
- ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడమే కారణమని వివరణ
- టర్కీలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు

పెన్ పవర్ డెస్క్:అమెరికా మరోసారి ఇరాన్‌పై దాడులకు సిద్ధమవుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత రాత్రి భారీ దాడులు నిర్వహించామని తెలిపారు. అవసరమైతే మరోసారి కూడా అదే స్థాయిలో దాడులు చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

- మిగతా 2లో






## వైఎస్సార్ కు మరణం లేదు

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన షర్మిల
- వైఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రశంస
- ఆయన మరణం తట్టుకోలేక 700 మంది ఆయనతో పాటే వెళ్లిపోయారని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

### హ్యాసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- బుసాన్‌లో హ్యాసంగ్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏపీలో ఆర్‌అండ్‌డీ, ఇన్నోవేషన్ సెంటర్ కోరిన మంత్రి
- దక్షిణ భారత తయారీ క్లస్టర్‌పై ప్రత్యేక ప్రతిపాదన
- కుప్పంలో రూ.900 కోట్ల ప్లాంట్‌ను గుర్తు చేసిన హ్యాసంగ్
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీ హామీ

దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. ప్రముఖ హ్యాసంగ్ గ్రూప్ ఉన్నత స్థాయి ప్రతినిధులతో బుసాన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌వేర్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేలా పలు కీలక ప్రతిపాదనలు చేశారు.కుప్పంలో హ్యాసంగ్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.




అదే ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపొనెంట్, మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు.ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత కస్టమైజేషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్‌పై పరిశోధనలు జరిగే నెక్స్ట్ జనరేషన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్

- మిగతా 2లో



## హిందూ మనోభావాలు ముఖ్యం కాదా?

- రావణ్‌కు వైసీపీ నేతలు మద్దతు తెలుపుతున్నారంటూ ఆనం మండిపాటు
- కోట్లాది మంది హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం కాదా? అని ప్రశ్న
- ఎవరైనా సరే పరిధి దాటి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

- మిగతా 2లో



## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

### నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం

- అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ చిన్నారి నిరంజన్ మృతి
- గత నెలలోనే హనుమకొండకు వెళ్లి నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- చిన్నారి మనల్ని విడిచి వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన

పెన్ పవర్ డెస్క్:జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, తెలంగాణలోని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ నిన్న రాత్రి కన్నుమూశాడు. ఈ వార్త తెలియగానే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సోషల్ మీడియా వేదికగా

- మిగతా 2లో

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన జగన్
- తన తండ్రి ఆశీస్సులే తన ధైర్యం అంటూ ట్వీట్
- మిస్ యూ నాన్నా అంటూ భావోద్వేగం

పెన్ పవర్ డెస్క్:దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. “మీరే నా స్ఫూర్తి.. మీ ఆశీస్సులే నా ధైర్యం.. మిస్ యూ నాన్నా” అంటూ జగన్ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోలను పంచుకున్నారు.

- మిగతా 2లో



## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

- పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్
- కేర్‌వెల్ ఏవియేషన్ గ్రూప్‌తో లావాదేవీలపై దర్యాప్తు
- పార్టీ నిధులతో విమానం, హెలికాప్టర్ కొని లీజుకు తీసుకున్నట్లు ఆరోపణలు

పెన్ పవర్ డెస్క్:పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన ‘కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్’కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్,

- మిగతా 2లో



## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

### గడ్కరీ ఘాటు కౌంటర్

- ఇథనాల్‌తో తనకు లాభం లేదన్న గడ్కరీ
- ఇథనాల్ ఉత్పత్తిలో తమ కంపెనీ వాటా కేవలం 0.07 శాతమేనని వెల్లడి
- ఆరోపణలను పూర్తిగా ఖండించిన కేంద్ర మంత్రి
- వాహనాలు దెబ్బతిన్నాయని ఆధారాలు చూపాలని సవాల్
- ఫిర్యాదులు వస్తే విచారణ చేస్తామని హామీ
- తనపై కుట్ర జరుగుతోందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# జగన్ థీమా ఏంటి? వచ్చే ఎన్నికల్లో గెలుద్దామంటే?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి కోటరీ గుప్పిట్లో చిక్కుకుంటున్నారు. ఆయన కూడా మాట మార్చడంలోనూ, మడమ తిప్పడంలోనూ ఆరితేరినట్లు కనిపిస్తుంది. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలో నడుస్తున్నానని చెప్పినప్పటికీ ఆచరణలో అది కనిపించడం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో వరసగా మాట మారుస్తున్న జగన్ కు విశ్వసనీయత లేదన్న అధికార పార్టీ నేతల విమర్శలను ఎవరైనా అంగీకరించాల్సిందే. 2014 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత ప్రతిపక్ష నేతగా జగన్ రాజధాని అమరావతిని నాడు సమర్థించారు. అసెంబ్లీ వేదికగానే అమరావతిలో రాజధాని నిర్మాణానికి తన అంగీకారాన్ని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో విడిపోయిన రాష్ట్రానికి ఒక మంచి రాజధాని అవసరమని కూడా జగన్ అన్నారు.

**అధికారంలోకి రాగానే...**

కానీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన సులవుగా మాట మార్చారు. కేవలం అమరావతిలోనే అభివృద్ధి జరిపితే మిగిలిన ప్రాంతాలు అన్యాయమైపోతాయని, అందువల్ల మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ను మూడు రాజధానులుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో శాసన రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని చెప్పి అదే నినాదంతో 2024 ఎన్నికలకు జగన్ వెళ్లి బోల్తా పడ్డారు. 2024 ఎన్నికలలో పదకొండు స్థానాలు దక్కి ప్రతిపక్ష హోదా కూడా అధికారికంగా దక్కించుకోలేకపోయారు. అంటే మూడు రాజధానుల ప్రతిపాదనను నాడు మూడు ప్రాంతాల ప్రజలు సమర్థించలేదన్న విషయాన్ని అర్థమయిన జగన్ మళ్లీ మాట మార్చారు.

**అమరావతికి వ్యతిరేకం కాదంటూనే...**

ఇప్పుడు అమరావతి కు వైసీపీ వ్యతిరేకం కాదంటూనే వైఎస్ జగన్ అమరావతి పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీ కు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు మాత్రమే వ్యతిరేకం అని పేర్కొన్నారు. ఇప్పటికే సంపద సృష్టిస్తున్న నగరాలు మావిగన్ పేరును తెరపైకి తెచ్చారు. అమరావతి ఎప్పటికీ సంపద సృష్టించలేదని, వంద సంవత్సరాలు దాటిన కష్టమేనని చెప్పుకొచ్చారు. మావిగన్ అనేది 60 లక్షలు జనాభా ఉన్న ప్రాంతమని, అమరావతిలో కేవలం 29 గ్రామాల ప్రజలు మాత్రమే ఉన్నారని కొత్త నినాదం అందుకున్నారు. 9,536 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మావిగన్ ఉంటుందని, అమరావతి కేవలం 217 చదరపు కిలోమీటర్లు మాత్రమేనని అన్నారు.అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్ మాత్రమేనని, మౌలిక సదుపాయాలు అన్నీ కలిగినది మావిగన్ అంటూ కొత్త నిర్వచనం చెప్పారు. ఇది వినేవారికి మరో రాజకీయ అంశంగానే చూస్తారు. ఎందుకంటే అమరావతిలో ఇప్పటికే యాభై వేల కోట్ల రూపాయలతోపనులు ప్రారంభమయ్యాయి. మళ్లీ మావిగన్ ప్రతిపాదనతో ఎన్నికలకు వెళితే జగన్ అధికారంలోకి రాగలరా? అనే సందేహం వైసీపీ నేతల్లోనే వ్యక్తమవతుంది.

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు.. హ్వాసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- మొదటి పేజీ తరువాయి

ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు సేవలందించేలా సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందులో కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, కార్పొరేట్, లాజిస్టిక్స్ విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హ్వాసంగ్ ఫుట్‌వేర్‌కు చెందిన టైర్-1, టైర్-2 విక్రేతలతో ఏపీలో సప్లయర్ సమావేశం నిర్వహించాలని కోరారు.

సమావేశంలో హ్వాసంగ్ కార్పొరేషన్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ స్పందించారు. కుప్పంలో రూ.900 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. అడిడాస్‌తో పాటు పలు అంతర్జాతీయ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా ఉన్న ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేయనున్నట్లు చెప్పారు.

మొదట ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని ఉత్పత్తి ప్రారంభిస్తామని, తర్వాత దేశీయ మార్కెట్‌కు కూడా విస్తరిస్తామని వెల్లడించారు. పుణే, చెన్నై, అనంతపురం జిల్లా గుడపల్లిలో ఆటో విడిభాగాల తయారీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# వైఎస్సార్ కు మరణం లేదు

తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు' అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు మాత్రమే పని చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

# హిందూ మనోభావాలు ముఖ్యం కాదా?

హిందూ దేవతలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రావణ్‌కు వైసీపీ నాయకులు మద్దతు తెలపుతున్నారంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయంలో మాట్లాడిన ఆయన, "కోట్లాది మంది హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం కాదా? మత విద్వేషాలు రెచ్చగొడుతూ, హిందూమతాన్ని అవమానించిన రావణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దా?" అని వైసీపీ నేతలను నిలదీశారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ మతాన్ని తక్కువ చేసి మాట్లాడటం, సమాజంలో విచ్ఛిన్నానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి విద్వేషాలు రెచ్చగొట్టడానికి రావణ్‌కు గానీ, మాజీ సీఎం జగన్ కు గానీ ఎవరు అధికారమిచ్చారని ఆనం ప్రశ్నించారు. ఎవరైనా సరే పరిధి దాటి మాట్లాడితే ఊరుకునేది లేదని.. నోటికొచ్చినట్లు వాగితే కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి హెచ్చరించారు.

# ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు.పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని

కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

# మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది.

ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

# నాన్నా.. మీరే నా స్ఫూర్తి

- మొదటి పేజీ తరువాయి

ఇడుపులపాయలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు పలువురు వైసీపీ సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదల సంక్షేమం, ఉచిత విద్య, వైద్యం, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన నేతగా రాజన్న ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని వారు స్మరించుకున్నారు.

# ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

- మొదటి పేజీ తరువాయి

'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం..

- మొదటి పేజీ తరువాయి

టర్కీలోని అంకారాలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని ప్రస్తావించారు. గత రాత్రి తీవ్ర స్థాయిలో దాడులు నిర్వహించామని, అవసరమైతే ఈ రాత్రి కూడా అదే తరహా దాడులు చేస్తామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగుతుండటమే దీనికి కారణమని ఆరోపించారు.ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసిన తర్వాత కాల్పుల విరమణ కొనసాగబోదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తన దృష్టిలో చర్చలు జరపడం వృథా అని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ చర్చలు కొనసాగించేందుకు అమెరికా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అయితే వాటి ఫలితాలపై మాత్రం సందేహం వ్యక్తం చేశారు.తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం ముదిరుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు ఐదు శాతానికి పైగా పెరిగాయి. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి.

# ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

- మొదటి పేజీ తరువాయి

నిరంజన్‌ను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగాన్ని ఆయన వ్యక్తం చేశారు.

"నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్దిరోజుల క్రితమే హనుమకొండలో వాళ్ల ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా నా కళ్లముందే కదలాడుతున్నాయి. అంతటి భయంకరమైన అనారోగ్యంతో పోరాడుతూ కూడా నన్ను చూడగానే ఆ చిన్నారి ముఖంలో విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం. శరీరం వ్యాధితో క్షీణిస్తున్నా... మనసు నిండా కొండంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అంతటి ధైర్యశాలి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోతున్నా. ఆ చిన్నారి చూపిన ప్రేమ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది" అంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు.

గత నెలలోనే నిరంజన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా హనుమకొండ వెళ్లి అతడిని పరామర్శించారు. ఆ సమయంలో నిరంజన్‌ను గుండెలకు హత్తుకుని, తిరుమల ప్రసాదం ఇచ్చి, సెల్ఫీ కూడా దిగారు. తనకు ఒక కుక్కపిల్ల కావాలని అడగ్గానే... ఆ రోజే కుక్కపిల్లను పంపించారు. అంతేకాదు, "నేను 'ఓజీ 2' తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్.. ఇద్దరం కలిసి సినిమా చూద్దాం" అని పవన్ మాట ఇచ్చారు. కానీ, ఈ లోపే చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఫ్యాన్స్ ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు, బాలీవుడ్ రియల్ హీరో సోనూ సూద్ సైతం నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆ కుటుంబానికి తానున్నానంటూ కొండంత ధైర్యాన్ని అందించారు.

# ప్రజలసమస్యలపై( పీఓ)కువినతిపత్రంఅందజేత



★ టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.8:** మండలంలోని ప్రజలసమస్యలపై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,టిడిపిపార్టీ మండలనాయకులతోకలిసి,బుధవారం చింతూరు ఐ.టీ డీ.ఏ.ప్రాజెక్టు అధికారి (పీఓ)కు వినతిపత్రంఅందజేశారు. ప్రజలసమస్యలపైచింతూరు ఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు అధికారి సానుకూలంగా స్పందించి,తగుచర్యలుతీసుకుంటామని, హామీ ఇచ్చారని,టిడిపిపార్టీమండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. వినతిపత్రంలోని ప్రజలసమస్యలు వరద నిధుల తక్షణ వినియోగం,రానున్న గోదావరి,శబరి నదుల వరదలను దృష్టిలోఉంచుకుని,ఆర్‌డబ్ల్యూఎస్,విభాగానికి మంజూరైన రూ.10 లక్షల ప్రత్యేక నిధులను త్వరితగతిన వినియోగించాలి.వరద ప్రభావిత ప్రాంతాల్లో హ్యాండ్ బోర్లు,ఫ్లెషింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.విద్యుత్ శాఖలో వి.ఆర్.పురం మండలానికి ప్రత్యేక అసిస్టెంట్ ఇంజనీర్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఇక్కడ ఏఈని నియమించి,విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని,వరద సాయం,బకాయిల విడుదల:గత ఏడాది వరద బాధితులకు అందవలసిన తక్షణ సహాయం రూ.3,000 నగదు,25 కిలోల బియ్యాన్ని వెంటనే పంపిణీ చేయాలని,గత వరదల్లో ప్రాణాలనుపణంగా పెట్టి సేవలందించిన,మరనాటు పడవల కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను,వెంటనే విడుదల చేయాలని,పెద్దమట్టపల్లి నుండి కుందులూరు మీదుగా చింతూరు మండలం నరసింగపేట,వరకు అన్ని అనుమతులతో కూడిన రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని,టీడీపీ నాయకులు అందజేసిన,వినతిపత్రంపై ప్రాజెక్ట్ అధికారి సానుకూలంగా స్పందించారని,తెలిపారు.మండలంలో నెలకొన్న ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి,వీలైనంత,త్వరగా పరిష్కరిస్తామని,హామీ ఇచ్చారని,తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటీడీపీ కన్వీనర్,ఆకోజు భాగ్యలక్ష్మి,పార్టీ నాయకులు అప్పాజీ,రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# పుష్కర ఏర్పాట్లపై స్వచ్ఛంద సంస్థలతో సమీక్ష




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 8 :** తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టవలసిన ఏర్పాట్లపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.
సమావేశంలో గోదావరి ఘాట్ల వద్ద భక్తులకు కల్పించాల్సిన కనీస వసతులు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సరఫరా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ చర్చించి అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులకు అందించే నీటి ప్యాకెట్లు ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, కాగితపు గ్లాసుల నీటిని సరఫరా చేయాలని సూచించారు. భక్తులకి త్రాగునీరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నదిలో నీటి మట్టాలు, ఘాట్ల వద్ద భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ, ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. భక్తులకు పాలు, మజ్జిగ, త్రాగనీరు, ఆహారం అందించే స్వచ్ఛంద సంస్థల సేవలను సమన్వయం చేసి ఒక్కొక్కరికి ఒక ఘాట్ కేటాయించాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు సమాచారం అందించడం, ట్రాఫిక్ నియంత్రణ చేసే వాలంటీర్లకు ఐడి కార్డులు డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పుష్కర, డిప్యూటీ కలెక్టర్లు మున్సిపల్, రెవెన్యూ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొని ఘాట్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలను కలెక్టర్‌కు వివరించారు.

# డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో

# రాష్ట్ర స్థాయి సాంకేతిక కార్యక్రమాల సమీక్ష.




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 08:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, నీటి కొరత, పెరుగుతున్న సాగు వ్యయాలు, కొత్త చీడపీడలు, వ్యాధుల వంటి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ఉద్యాన రైతులకు శాస్త్రీయ పరిష్కారాలు అందించేందుకు
డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా వెంకట్రామన్నగూడెం విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయంలో, 19వ రాష్ట్రస్థాయి సాంకేతిక కార్యక్రమాల సమీక్ష (ఎస్.ఎల్.టీ.పీ.) ఈ రోజు నుంచి అనగా ఈ నెల నాలుగు రోజుల పాటు హైబ్రిడ్ పద్ధతి లో నిర్వహించనున్నారు.
ఈ కార్యక్రమం లో రాష్ట్రంలోని వివిధ పరిశోధనా కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని ఉద్యాన రంగంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ పరిశోధనల దిశపై సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందించనున్నారు.
జోనల్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కమిటీ సమావేశాల్లో రైతులు సూచించిన సమస్యలను ఆధారంగా తీసుకుని, వాతావరణ మార్పులను తట్టుకునే కొత్త సాంకేతికతల అభివృద్ధి, కృత్రిమ మేధస్సు (ఏ.ఐ) ఆధారిత చీడపీడల పర్యవేక్షణ, డ్రోన్ సాంకేతికత వినియోగం, సహజ వ్యవసాయ పద్ధతుల శాస్త్రీయ ధ్రువీకరణ, నీటి వినియోగ సామర్థ్య పెంపు, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, మెకడామియా వంటి అధిక విలువ కలిగిన పంటల ఉత్పత్తి సాంకేతికతలు, కొబ్బరి, ఆయిల్‌పామ్, మామిడి, అరటి, జీడిమామిడి తదితర ఉద్యాన పంటల్లో చీడపీడలు, వ్యాధుల సమగ్ర నివారణ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, ఎగుమతులకు అనువైన ప్రమాణాల రూపకల్పన వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు.
ఎల్‌నినో వంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు రైతులకు వాతావరణ ఆధారిత శాస్త్రీయ సలహాలు, ముందస్తు హెచ్చరికలు, నీటి సంరక్షణ పద్ధతులు, వేడి ఒత్తిడిని తట్టుకునే సాగు విధానాలు, చీడపీడల ముందస్తు అంచనాలు, మొబైల్ ఆధారిత సాంకేతిక సూచనలను మరింత సమర్థవంతంగా అందించేందుకు విశ్వవిద్యాలయం తన పరిశోధన, విస్తరణ సేవలను బలోపేతం చేయనున్నట్లు తెలిపింది. శాస్త్రీయ సలహాల ద్వారా వాతావరణ మార్పుల వల్ల రైతులకు కలిగే నష్టాలను తగ్గించి, ఉద్యాన పంటల ఉత్పాదకత, నాణ్యత, రైతుల ఆదాయాన్ని పరిరక్షించడమే విశ్వవిద్యాలయం లక్ష్యమని పేర్కొంది.
ఈ సందర్భంగా ఉపకులపతి డా . కట్టుపల్లి ధనుంజయరావు మాట్లాడుతూ, “వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం ఉద్యాన రైతులకు సవాలుగా మారుతున్న తరుణంలో రైతులను ఒంటరిగా వదిలిపెట్టం. శాస్త్రీయ పరిశోధనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, సమయానుకూల సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉంది. రైతుల ఆదాయాన్ని పెంచే, సాగును లాభసాటిగా మార్చే సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికే మా పరిశోధనల్లో అత్యధిక ప్రాధాన్యం ఇస్తాం” అని తెలిపారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కార్యక్రమంలో జరిగే చర్చలు ఉద్యాన పరిశోధనలకు కొత్త దిశానిర్దేశం చేయడంతో పాటు రాష్ట్ర ఉద్యాన రంగ అభివృద్ధికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ రోజు జరిగిన ప్రారంభ సమావేశానికి ప్రముఖ శాస్త్రవేత్తలు డా. ఆలపాటి సత్యనారాయణ, డా. ఆర్.వి.ఎస్.కె. రెడ్డి, డా.బి. శ్రీనివాసులు, డా.ఎ. సుజాత విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా. ఎస్. సూర్యకుమారి, డా.సీఎమ్. రూత్, డా. బి. ప్రసన్న కుమార్, డా. డి. వెంకట స్వామి, పరిశోధన సహాయ సంచాలకులు, విశ్వవిద్యాలయ అధికారులు, వివిధ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు తప్పనిసరి

రంపచోడవరంలో పాఠశాలలను పరిశీలించిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారీయా(





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 8:**
రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ తరగతులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారీయా అధికారులను ఆదేశించారు.
బుధవారం పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణితో కలిసి రంపచోడవరం మండల పరిషత్ పాఠశాల, గురుకుల బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల సమీపంలోని క్రీడా మైదానాలను ఆమె పరిశీలించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు, డిజిటల్ తరగతులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు అవసరమైతే ఒకటి కంటే ఎక్కువసార్లు బోధించాలని పేర్కొన్నారు.
పాఠశాలల్లో పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు, విద్యార్థుల హాజరు వంటి అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందాయా లేదా అనే విషయాన్ని కూడా ఆరా తీశారు.
మధ్యాహ్న భోజన పథకంలో పోషకాహార ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పాఠశాల ప్రాంగణాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.
మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కమిషనర్, వారికి బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నాయా, మధ్యాహ్న భోజనం సక్రమంగా అందుతోందా అనే విషయాలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఏపీఆర్‌జేసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల సమీపంలోని క్రీడా మైదానాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, డీఈ భవాని, సహాయక గిరిజన సంక్షేమ అధికారి జల్లి శంభుడు, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, ముత్యాలరావు, టీ. మల్లేశ్వరరావు, సత్యనారాయణ, బాలు దొర, నరసింహారావు, సీఎంఓ చినబాబు, కారం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 8:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. విజయశంకర్ ఆధ్వర్యంలో రాజానగరం లోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో వైద్యులు, వైద్య విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సి.ఐ. మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే పిలియన్ రైడర్ ఇద్దరూ తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు.
మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించడం వంటి చర్యలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.
రోడ్డు ప్రమాదం జరిగిన తొలి గంటను గోల్డెన్ అవర్ గా పరిగణిస్తారని, ఈ సమయంలో బాధితుడికి సకాలంలో వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు.
పథకం ద్వారా హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులకు, గాయపడిన బాధితులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం గురించి అవగాహన కల్పించారు. ప్రమాద బాధితులకు వెంటనే సహాయం చేయడంతో పాటు, ప్రభుత్వ పరిహార పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.
వైద్యులు, వైద్య విద్యార్థులు తమ వృత్తి ధర్మంతో పాటు సమాజంలో రోడ్డు భద్రతపై ప్రజలకు చైతన్యం కల్పించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఎస్సై డి. రామ్ కుమార్ , జీఎస్ఎల్ మెడికల్ కళాశాల అధ్యాపకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఘనంగాడాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు





**ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయం**

**గంగవరం, పెన్ పవర్, జూలై 8:**దివంగత ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గంగవరం మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకుంటూ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ, విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు గృహాలు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక సంక్షేమ పథకాలతో కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానేతగా ఆయనను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని కొనియాడారు. పేద ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన పాదయాత్ర, ప్రజలతో మమేకమైన నాయకత్వం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, విలువలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రజా సంక్షేమ భావజాలాన్ని ప్రతి ఇంటికీ చేరవేసేందుకు కృషి చేస్తామని, ప్రజలకు అండగా నిలవడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కార్యకర్తలు "డాక్టర్ వైఎస్సార్ అమర్ రహే" అంటూ నినాదాలు చేస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు యజ్జు వెంకటేశ్వరరావు, మండల ఇంచార్జ్ సీహెచ్ రఘునాథ్, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ ఏ. బేబీ రత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్. ఏడుకొండలు, మాజీ సర్పంచ్ నేసం మరిడమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు ఈపీ సతీష్, నాయకులు గోపాల్, జగదీష్, మాజీ ఉపసర్పంచ్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి నిర్మూలన విజిలెన్స్ కమిటీ సభ్యుడు గంగాధరరావుకు ఎమ్మెల్యే అభినందనలు



**పెన్ పవర్ । ఉంగుటూరు । జులై 08:**వెట్టి చాకిరి నిర్మూలన వ్యవస్థ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఇమ్మణి గంగాధరరావును ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రం జిరాక్స్ ప్రతిని అందజేశారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గంగాధరరావును విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమించిన నేపథ్యంలో, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు ఆయనకు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

మూడు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడిగా సేవలందించిన సీనియర్ నాయకుడు గంగాధరరావుకు కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం లభించడం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## మహానేత వైఎస్సార్‌కు పాలాభిషేకం..
## రంపచోడవరంలో ఘనంగా 77వ జయంతి వేడుకలు



**రంపచోడవరం, పెన్ పవర్, జూలై 8:**
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. వైకాపా లీగల్ సెల్, యువజన నాయకుడు పండా సిద్ధార్థ దొర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పండా సిద్ధార్థ దొర, రాష్ట్ర యువజన నాయకుడు గొల్లపల్లి శివబాబు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఎన్నో చారిత్రాత్మక పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన మరణించి దశాబ్దానికి పైగా గడిచినా ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు.
ఈ కార్యక్రమంలో రంపచోడవరం వైకాపా సీనియర్ నాయకుడు కప్పల వెంకటరావు, నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యుడు రాపాక సుధీర్ రాజ్, యువజన నాయకులు డా. హేము, ఇర్ప శ్రీను, వినోద్, కోసు శ్రీను, కారం శేఖర్ బాబు, దివాకర్‌తో పాటు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.ు

## ప్రత్యేక పాలనలో పంచాయతీలు..
## మూడు నెలలైనా మారని సమస్యలు



**సీతానగరం, పెన్ పవర్, జూలై 08:**పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనా గ్రామాల్లో సమస్యలు మాత్రం యధాతథంగానే
కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధిరులు భ్యాధతలు చేపట్టి మూడు నెలలు గడుస్తున్నా కాలువలు రహదారులు పారిశుద్ధ్యం ఫాగింగ్ వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు నుంచి ఐదు గ్రామపంచాయతీల బాధ్యతలు అప్పగించారు. శాఖపరమైన విధులతో పాటు పంచాయతీల నిర్వహణను కూడా వీరే పర్యవేక్షించాల్సి ఉండడంతో గ్రామాలపై సరైన దృష్టి పడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు పెండింగ్ బిల్లులు చెల్లింపులు నిధులు వినియోగం ప్రజల సమస్యలు పరిష్కారం వంటి బాధ్యతలు పెరగడంతో గ్రామస్థాయిలో పాలన స్తబ్దుగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం గ్రామాల్లో దోమల నివారణ కోసం అందజేసిన ఫాగింగ్ యంత్రాలు ఇప్పటికీ కొన్నిచోట్ల వినియోగంలోకి నోచుకోక పోవడంతో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు తున్నారు. అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని ఫాగింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి




- **మితమైన ఆహారపు అలవాట్లు, ముందస్తు పరీక్షలతో నియంత్రణ సాధ్యం**
- **మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ ఊపిరితిత్తుల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గోపికృష్ణ వెల్లడి**

**రాజమహేంద్రవరం, ,పెన్ పవర్, జూలై08;** నేడు యాంత్రికంగా మారిన ఆధునిక జీవన శైలిలో మితమైన ఆహారపు అలవాట్లు, ముందస్తు పరీక్షలతో ప్రమాద కరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధులను నియంత్రణ సాధ్యమని యశోద హాస్పిటల్ ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి స్పెషలిస్ట్ డాక్టర్ యడ్లపాటి గోపికృష్ణ అన్నారు. స్థానికంగా బుధవారం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ, ప్రపంచంలో ప్రస్తుతం అన్ని రకాల క్యాన్సర్ వ్యాధుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదకర స్థాయిలో ఉందన్నారు. ప్రపంచంలో ఈ క్యాన్సర్ తో 18 లక్షల మంది రోగులు మృతి చెందతుండగా, దేశంలో 65,000 మంది చనిపోతున్నారన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా పొగకు ఉత్పత్తుల సేవించడం, ప్రభలడానికి కట్టెలు, పిడకల పొగ, మోటార్ వాహనాల పొగ, కాలుష్యము, ఆధునిక జంక్ ఫుడ్స్ ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమన్నారు. మూడు దశాబ్దాల క్రితం 50- 60 సంవత్సరాల మధ్య క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు బయటకు వచ్చేవారని, నేడు యువత ఈ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతుండ డం ఆందోళన ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆధునిక వైద్య పరికరాలు, చికిత్స విధానాలు యశోద హాస్పటల్లో అందుబాటులోకి వచ్చయన్నారు. నావిగేషనల్ బ్యాంకులో బ్రాంకుయోస్కోపి, టార్గెట్టెడ్ బయాప్సీ, చికిత్స విధానాలు ముందస్తు పరీక్షలతో, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వంశపారంపరంగా పొగాకు తాగే కుటుంబాల్లో 40% రిస్క్ ఉంటుందని, రెండు వారాలు పైబడి వీడని జ్వరం , బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో సాయికిరణ్ , రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తపస్సుకొండ ప్రాంతంలో విత్తనబంతుల వెదజల్లే కార్యక్రమం...







**అడ్డతీగల ,పెన్ పవర్, జూలై08;**అడ్డతీగల మండలం తపస్సు కొండ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టి 'హరిత కవచం' లక్ష్యంలో భాగంగా అడ్డతీగలలో విత్తనబంతుల వెదజల్లే కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శివకుమార్ గంగాల్ మరియు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జే.వి సుబ్బారెడ్డిల ఆదేశాల మేరకు, అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డతీగల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. యోగేంద్ర, అటవీ శాఖ సిబ్బంది, జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక వన సంరక్షణ సమితి సభ్యులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.
తపస్సు కొండ సౌత్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో, సుమారు 1200 విత్తనబంతులను (మారేడు, నేరేడు, చింత తదితర జాతులకు చెందినవి) అటవీ ప్రాంతంలో వెదజల్లారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అడవుల్లో సహజ సిద్ధమైన మొక్కలు మొలిచేందుకు వీలుగా అటవీశాఖ ఈ విత్తనబంతుల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భవిష్యత్ తరాల కోసం పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం, వారిని కూడా ఈ మహత్తర కార్యంలో భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ అధికారి పి .శ్రీనివాసరావు తెలిపారు.

# టిడిపి యూనిట్ల సమావేశం



**సీతానగరం, పెన్ పవర్ జూలై 08:**సీతానగరం మండలంలోని టిడిపి యూనిట్ల సమావేశం జరిగింది. బుధవారంనాడు వంగలపూడి గ్రామంలో ఒకటో యూనిట్ ఇన్చార్జ్ మండ రాంబాబు ఆధ్వర్యంలో ఏడు బూత్ లు టిడిపి నేతలు కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలోని అర్హులైన ఓటర్లందరినీ చేర్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కార్యకర్తలు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడడం ప్రతీ కార్యకర్త బాధ్యత అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చర్చించుకున్నారు. అదేవిధంగా రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందేలా చూడాలని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు నాయకులు కార్యకర్తలు పర్యవేక్షించి సమస్యలను పరిష్కారం చేసే విధంగా చేయాలనుకున్నారు. ఈ కార్యక్రమంలో గద్దె వెంకటకృష్ణ చౌదరి (నళిని), గద్దె నాని, షేక్ మీరా షరీఫ్ రాజు, గద్దె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 8**:వైద్య విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే స్పందించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, నిర్మాణాలు, నిర్వహణ పనులు చేపడుతున్న మెగా కంపెనీ ప్రతినిధులతో సమావేశమై జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని మెగా కంపెనీ ప్రతినిధులను ఎమ్మెల్యే వాసు ఆదేశించారు. కొత్త భవనానికి అప్రోచ్ రోడ్డు, ప్రవేశ మార్గాలు, లెక్చర్ గ్యాలరీలు, ఎలక్ట్రికల్ పనులు, పైపింగ్, ఆడియో-వీడియో టెస్టింగ్ వంటి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు తరగతుల నిర్వహణలో అంతరాయం కలగకుండా ఉన్న బ్లాకులను తాత్కాలికంగా వినియోగించుకోవా
లన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జూలై 25 నాటికి కొత్త లెక్చర్ గ్యాలరీలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పరీక్షల నిర్వహణపై సమీక్షించిన ఎమ్మెల్యే వాసు ఆగస్టు 15 నాటికి పరీక్షా హాళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. జనరేటర్, ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, పవర్ బ్యాకప్, ప్రింటింగ్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. . కొత్త హాస్టల్ భవనాల్లో రెండు అంతస్తులను ఆగస్టు నాటికి సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలురు, బాలికల హాస్టళ్లకు అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకులు, మౌలిక వసతుల పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని తాను నిరంతరం పర్యవేక్షిస్తానని, మళ్లీ తనిఖీ నిర్వహిస్తానని తెలిపారు.

# అడ్డతీగల మండలంలో వరి సాగుకు 90% రాయితీతో విత్తనాల పంపిణీ ప్రారంభం..



**అడ్డతీగల, పెన్ పవర్, జూలై08:**అడ్డతీగల మండలంలో ఖరీఫ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. గత సంవత్సరం తొలకరిలో దాదాపు 5,049 ఎకరాలలో సాగైన వరి పంటను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా, మండలంలోని రైతులకు సబ్సిడీపై నాణ్యమైన వరి విత్తనాలనుఅందించేందుకు ప్రభుత్వం 976 క్వింటాళ్ల నిల్వలకు ఆమోదం తెలపగా, ఇప్పటివరకు 680 క్వింటాళ్లను వివిధ రైతు సేవా కేంద్రాలకు (ఆర్బీకే) తరలించడం జరిగింది. ప్రస్తుతం ఈ విత్తనాల పంపిణీ ప్రక్రియను అధికారులు అధికారికంగా ప్రారంభించారు. ప్రధానంగా ఎం.టి.యు 1064 మరియు ఎం.టి.యు 1318 వంటి అధిక దిగుబడినిచ్చే రకాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకం కింద ఎస్టీ రైతులకు ప్రభుత్వం 90% రాయితీని కల్పిస్తుండటం విశేషం. ప్రతి 30 కేజీల బస్తాపై రైతు వాటా కేవలం రూ. 129 మాత్రమే చెల్లించాల్సి ఉంది. ఈ విత్తనాలను పొందేందుకు రైతులు తప్పనిసరిగా డి-కృషి యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది అని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అర్హులైన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం మరియు ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శివ శ్రీనివాస్ తెలిపారు.ఐ

# సాహస కథాంశంతో వస్తున్న రాజా ది రాజా చిత్రాన్ని ఆదరించాలి

- చిత్రం ప్రమోషన్ లో భాగంగా హీరో , హీరోయిన్లు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 8:** రాజుల కాలం నాటి ఒక యువకుడు సాహస కథాంశం తో వస్తున్న రాజా ది రాజా చిత్రాన్ని ఈనెల 17 వ తేదీన విడుదల చేస్తున్నామని థియేటర్లకి వెళ్లి ఆదరించాలని
చిత్ర బృందం విజ్ఞప్తి చేసింది.
చిత్రం ప్రమోషన్ లో భాగంగా హీరో, హీరోయిన్ల లతో పాటు చిత్ర బృందం స్థానిక షెల్టన్ హోటల్ లో మీడియాతో మాట్లాడారు. చిత్రం యువ హీరో రుత్విక్ మాట్లాడుతూ, ఆత్మాభిమానం గల ఒక యువకుడి సాహసం తో కూడిన ఈ చిత్రంలో మంచి నటీనటులు నటించారని డైరెక్టర్ చక్కగా తెరకెక్కించారని అన్నారు. ఈనెల 17వ తేదీన థియేటర్లో రిలీజ్ అవుతుందని, చిత్రాన్ని ఆదరించాలని కోరారు. హీరోయిన్ విశాఖ మాట్లాడుతూ, ఇది తనకు తొలి సినిమా అని, సాహస యువకుడ్ని ప్రేమించి, ప్రోత్సహించే విధంగా తన పాత్ర ఉంటుందన్నారు. నిర్మాత కె నిహారిక దాసరి మాట్లాడుతూ కథపరంగా నాణ్యతకు ఎక్కడ రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించామని తెలిపారు. హాస్య నటుడు భద్ర మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రమోషన్ని హైదరాబాద్ వంటి నగరాల్లో కాకుండా సెంటిమెంట్ గా భావించి నుంచి ప్రమోషన్ చేపట్టామన్నారు. చిత్రంలో హీరో హీరోయిన్లు కొత్త తరం వారని, అయినప్పటికీ సీనియర్ నటీనటులతో చక్కగా నటించారని అన్నారు. సినిమా రంగంతో పూర్వ అనుబంధం లేని మహిళ నిహారిక నిర్మాతగా రాణించడం, కొత్త తరాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. మరో నటుడు పార్వతీశం మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఉన్నటువంటి సినీ పరిశ్రమలో నిర్మాతగా మహిళ ప్రవేశించడమే రాకుండా చిత్ర నిర్మాణాన్ని నాణ్యత లో రాజీ పడకుండా చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యాంకర్ శ్రీవాణి ఉన్నారు.

# భారతీయ సంస్కృతిని మరియు సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి. ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 08:**భక్తి సంగీతం భారతీయ సంస్కృతిలో ప్రధాన భాగమని, సాంస్కృతిక కళల ద్వారా సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. భజన క్లబ్బింగ్ ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకులు స్థానిక విడిది కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ను కలిశారు. జూలై 26న తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న భజన క్లబ్బింగ్ భక్తి సంగీత కార్యక్రమానికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి తరం యువతకు భారతీయ సంప్రదాయాలను తెలియజేసి సనాతన ధర్మం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. సంప్రదాయ పరిరక్షణ కోసం ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మహిళా కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో
,చిక్కాల గీత భ్రమరాంబిక,వానపల్లి సునీత
,యలమర్తి భాస్కరి,తుమ్మలపల్లి అవంతి ,గమిని రాధిక, కారుమూరి సునీత, చలంచర్ల భాగ్యలక్ష్మి దేవి(సౌమ్య), నున్న శ్రీ నాగలక్ష్మి, పచ్చిపులుసు శారదరాణి, నార్కెడిమిల్లి భారతి
తదితరులు పాల్గొన్నారు.

# నగరం లో ఘనంగా వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి

**కల్తీ పాలబాధిత చిన్నారులకు ఆర్థిక సహాయం**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 8:**వై యస్ ఆర్ జయంతి వేడుకలలో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్
పాల్గొన్నారు. సిటీ పార్టీ కార్యాలయం లో వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ ఎంపీ మార్గాని భరత్ నివాళులు అర్పించారు.
సి ఈ సి సభ్యులు, మాజీ రుడా చైర్మన్, మాజీ శాసన సభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్, మార్గాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.కల్తీ పాల ఘటన బాధితులకు అండగా నిలబడి పోరాటం చేసి జగనన్న తో పరిస్థితులను వివరించి బాధితులతో స్వయంగా కలవగా జగనన్న ఒక్కొకరికి లక్ష చొప్పున చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులకు భరత్ చెక్కులను పంపిణీ చేశారు.
మోరంపూడి జంక్షన్ వద్ద చీరా రాజు, అరె చిన్ని ఆధ్వర్యంలో వై యస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు భరత్ పార్టీ శ్రేణులు అర్పించారు. యువజన విభాగం అధ్యక్షులు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో 28 వార్డు లో ఘనంగా రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పేదలకు చీరలను భరత్ పంపిణీ చేసారు.
కోటగుమ్మం వద్ద బీసీ నాయకులు ఉమ యాదవ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు పేదలకు గొడుగుల పంపిణీ చేసారు.
క్వారీ సెంటర్ వద్ద 45,46,47,48,49 వార్డు ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు సమక్షంలో వై యస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పేదలకు పళ్ళ పంపిణీ చేసారు.లాలాచెరువు వద్ద వార్డు యువనాయకులు గుత్తుల మురళి తనయుడు హర్ష ఆధ్వర్యంలో వై యస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పేదలకు స్వీట్స్ పళ్ళ పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మార్గని భరత్ మాట్లాడుతూ వై యస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు సిటీ లో పలు ప్రాంతాలలో పాల్గొన్నామని, పేదలకు పళ్ళు ,దుప్పట్లు అందించామన్నారు.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శులు వాసంశెట్టి గంగాధర్, సంయుక్త కార్యదర్శులు గుర్రం గౌతం, మార్తి నాగేశ్వరరావు, దాసి వెంకటరావు, పోలు విజయలక్ష్మి, మార్గాని సురేష్, శ్రీనివాస్ , అందనపల్లి సత్యనారా యణ, కంది రాఘవ, మునీశ్వరరావు, చోట ఖాన్, దుర్వాసుల సత్యనారా యణ, మదీనా బాషా, అక్రం , టేకుముడి సూరిబాబు, షబ్బీర్ , నల్లా రామాంజనేయులు, రొక్కం త్రినాథ్, దత్త, విజయ్, నందం స్వామి, కృష్ణ వేణి, అనంత లక్ష్మీ, అనురాధ, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా వైయస్సార్ జన్మదిన వేడుకలు.





- పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ, భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు.
- కొట్టు కేడర్ లో నూతన ఉత్సాహం...

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 08:**మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలో వైయస్సార్ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆయన కార్యాలయం నుంచి కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ తో వైయస్సార్ అమర్రహే అంటూ నినాదాలు చేసుకుంటూ వైయస్సార్ విగ్రహానికి చేరుకున్నారు. బైక్ ర్యాలీలో కొట్టు సత్యనారాయణ బైక్ నడిపి అందరినీ ఆకట్టుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు అభిమానులు భారీగా తరలివచ్చి వైయస్సార్ విగ్రహానికి కి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు చేసిన మేలను గుర్తుపెట్టుకొని రైతు దినోత్సవంగా గర్వంగా ప్రకటించుకున్న రోజు ఈరోజు అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మహిళాలకు, కార్మికులు కు, రైతులుకు, విద్యార్థులకు ఆయన చేసిన సంక్షేమకార్యక్రమం లు ఆదర్శవంతమయ్యాయి. తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధికి నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి వెసిన విత్తనాలు ఈనాడు మహా వృక్షాలుగా ఎదిగాయని కొనియాడారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందని, గంజాయి, హత్యలు వంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని అసలు పోలీసు వ్యవస్థ పనిచేస్తుందా అని మండిపడ్డారు. నియోజకవర్గంలో తాను తెచ్చిన అభివృద్ధి కార్యక్రమాలే నేడు శంకుస్థాపనలు చేస్తున్నారని అంతకుమించి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో కూటమి నాయకులు ఆధ్వర్యంలోనే మట్టి దోపిడీ, పేకాట క్లబ్బులు, అదేచ్ఛగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. దీనిపై పోలీస్లు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మొద్దు నిద్ర పడుతున్నారని అన్నారు. నియోజకవర్గం లో ప్రతిపక్ష పాత్ర పోషించవలసిన నాయకులు, కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రశ్నించకుండా మౌనం గా ఉండడం ఎలాంటి సాంకేతాలకు దారి తీస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు భరోసా ఇవ్వాల్సిన నాయకులు మౌనంగా ఉండడం, ప్రజల సమస్యలపై పోరాటాలు చేయలేకపోవడం చూస్తుంటే చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల మేరకు కొంతకాలం సైలెంట్ గా ఉన్నానే తప్ప పార్టీని గానీ, పార్టీ కార్యకర్తలను గాని వదులుకోలేదని అన్నారు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తానని తెలిపారు.

# ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శశి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారీ మొక్కల నాటే కార్యక్రమం





**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జూలై 08.**పర్యావరణ పరిరక్షణ మరియు హరితాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో భారీ స్థాయిలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి శశి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ స్పాన్సర్‌గా వ్యవహరించి మొక్కలను అందజేశారు. సంస్థ కార్యదర్శి శ్రీమతి మేకా క్రాంతి సుధ కార్యక్రమం విజయవంతం కావడానికి తన ప్రోత్సాహాన్ని అందించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ , ఉపాధ్యాయురాలు ఇందిరా వాణి, పాఠశాల టీచర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సల్మాన్ బాషా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా భావాన్ని, పర్యావరణ పరిరక్షణ పట్ల వారి నిబద్ధతను అభినందించారు. సమాజ అభివృద్ధికి దోహదపడే ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

# గొడవర్తి బాబికి పితృవియోగం




**ఆలమూరు, పెన్ పవర్, జూలై 08;**ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి) తండ్రి గొడవర్తి సూర్యనారాయణ (అబ్బు--85) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళు లర్పించారు. కూటమి నాయకులు, కొత్తపేట నియోజకవర్గం కమ్మ సంఘం సభ్యులు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు బాబి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సూర్యనారాయణ మృతి చెందిన విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బాబి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సూర్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# గోకవరంలో దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి జయంతి వేడుకలు.







**గోకవరం పెన్ పవర్ జులై 08**:-దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు గోకవరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత వైభవంగా నిర్వహించారు.గోకవరం మండలం గోకవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఎంపీపీ ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఉభయగోదావరి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ పాల్గొని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనతరం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు,గర్భిణీ,బాలింతలు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట శ్రీరాంజీ మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖం లో చెరగని చిరునవ్వు, నడకలో తెలుగుదనం ఉట్టి పడే రాజసం, పేదల గుండెల్లో ఎప్పటికీ జరగని జ్ఞాపకం మన అభివృద్ధి ప్రదాత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త భాష్యం చెప్పిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన చేసిన అభివృద్ధి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ఆరోగ్యశ్రీ పథకం సృష్టికర్త డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైయస్సార్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

## ఘనంగా కీ:శే:దివంగత వై.యస్.రాజశేఖర్,రెడ్డి, 77వ.జయంతి



వై.సి.పి.మండలకమిటీ నాయకులుకార్యకర్తలు

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై. 8:**మండలంలోని రేఖపల్లి,వై.యస్.రాజశేఖర్,రెడ్డి,విగ్రహంవద్ద బుధవారంవై.సి.పి.మండలకమిటీ ఆధ్వర్యంలో దివంగతవై.యస్.రాజశేఖర్,రెడ్డి,77వ.జయంతి, వేడుకలను,ఘనంగానిర్వహించడం జరిగింది.తదు పరి,వై.సి.పి.మండల కమిటీనాయకులు కార్యకర్తలు రేఖపల్లి,ప్రభుత్వ వైద్యశాలో చికిత్స పొందుతున్న,రోగు లకు,రొట్టెలు,పం డ్లు,పంపిణీ చేశారు.ఈసందర్భంగా వై. సి.పి.జిల్లాఅధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ,మండల జనరల్ సెక్రెటరీ,మోడెం నరేష్,మాట్లాడుతూ కీ:శే:దివం గత,మాజీ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్,రెడ్డి,ఆరోగ్య శ్రీ ద్వారామధ్య తరగతి నిరుపేదలకు,ఉచితమైన వైద్య సే వలు,విద్యార్థులకు,ఫీజు రీయింబర్స్,మెంట్ ద్వారా ఉన్న తమైనవిద్య,వ్యవసాయరైతులకు,రుణమాఫీ ఉచిత విద్యుత్తు,సంక్షేమ పథకాలతో పాటు,రాష్ట్ర ప్రజలకు చేసి న సేవలు,ప్రజలహృదయాల్లోవై.యస్.చిరస్థాయిగా నిలిచి పోయారని,కొనియాడారు.ఈ కార్య క్రమంలో రాష్ట్ర నాయ కులు మాచర్ల గంగులు,మాజీ మండల ప్రెసిడెంట్, పోడి యం గోపాల్,జిల్లాఅధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ. మండల వైస్ ప్రెసిడెంట్,వడ్డానపు చిన్నరాజారావు,మండ ల సీనియర్ నాయకులు కాపురపుఉమా,మండల జనరల్ సెక్రెటరీ మోడెంనరేష్,మండల యూత్ ప్రెసిడెంట్ కడుపు బాలు,రాజుపేట మాజీ ఉప సర్పంచ్,ముంజపురాము, మండల బూత్ కన్వీనర్,మడకం కన్నారావు,మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కోటం జయ రాజు,మాచర్ల వెంగళరావు, సుమన్,గణిత్ర కిట్టు,మోడెం రాజేష్,మేకల మాధవరావు, కొట్టుకనుమ రాజులు,కడుపు సాయి,బురక దుర్గారావు అన్నవరం మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ఎచ్చు రవి సాయం







**కూనవరం,పెన్ పవర్,జూలై8.** పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్రామ శాఖ అధ్యక్షుడు ఎచ్చు రవి నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు.2022 వరద బాధితులైన తాళ్లూరి కుటుంబానికి బియ్యం,నిత్యవసర సరుకులు. వెయ్యి రూపాయలు ఇచ్చి,ఒంటరి మహిళ పెన్షన్ కోసం కృషి చేస్తానన్నారు.కొత్తూరుకు చెందిన బత్తుల కొమరయ్య కుటుంబానికి బియ్యం,నిత్యావసర సరుకులతో పాటు మందుల కోసం 2వేలు అందించారు.పార్టీలకు అతీతంగా పేదలకు సహాయం చేస్తానని రవి తెలిపారు.

## సంక్షేమ ఫలాలకు జీవం పోసిన నాయకుడు వైయస్






- ఆయన ప్రవేశపెట్టిన పథకాలే నేటికీ అమలు
- వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి ఘనంగా

**కూనవరం,పెన్ పవర్,జూలై8.** సంక్షేమ ఫలాలకు నిలువెత్తు నిదర్శనం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి మండలంలో ఘనంగా నిర్వహించారు.ప్రతి సంవత్సరం వైఎస్ జయంతిని వైయస్సార్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించేవారు.77వ జయంతి మండలంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటా పోటీగా నిర్వహించారు.మండల కేంద్రంలో వైయస్సార్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల మరియాదాసు ఆధ్వర్యంలో,కాచవరం గ్రామంలో ఆలూరి కోటయ్య వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కేక్ కట్ చేశారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీమంతుల వెంకట రామారావు,హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో కోతులగుట్ట నందు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు,బ్రెడ్,పండ్లు,బిస్కెట్స్ అందించారు.వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు.సంక్షేమ ఫలాలు కారణంగా ప్రతి ఇంటిలో లబ్ధి పొందిన వారు ఉన్నారని అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ ఆయన ఘనతేనని పేర్కొన్నారు.ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రభుత్వాలు మారుతున్న ఆ పథకాలను ప్రవేశ పెడుతూనే ఉన్నారని అన్నారు.ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా ఉన్నాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుజ్జ విజయ,దీకొండ గంగాధర్,భరత మూర్తి,దివాకర్, కాంగ్రెస్ నాయకులు మాజీ సొసైటీ చైర్మన్ నాగరాజు నందికొండ శ్రీనివాస్,షేక్ అహ్మద్ భాష, ఇస్మాయిల్,రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గంగాధరరావును సత్కరించిన అభిమానులు



**పెన్ పవర్ -- ఉంగుటూరు । జులై 08**
వెట్టి చాకిరి నిర్మూలన వ్యవస్థ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఇటీవల నియమితులైన ఇమ్మణి గంగాధరరావును తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు రెడ్డి చందు గంగాధరరావుకు దుశ్శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మూడు పర్యాయాలు టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా సేవలందించిన సీనియర్ నాయకుడు గంగాధరరావుకు కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించడం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు మరింత బాధ్యతాయుతంగా ప్రజాసేవ చేసే అవకాశం లభించిందని అభినందనలు తెలిపారు.

## వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 08.**తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడుఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి పోలీస్ ఐలాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారం అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ, పడాల వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, రైతు పక్షపాత విధానాలు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ బలోపేతానికి పునరంకితం కావాలన్నారు. ఆరోగ్యశ్రీ ని ప్రవేశపెట్టి పేదల ఆరోగ్యాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి అని, ఫీజు రీయింబర్స్మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి అనేక పథకాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి తండ్రిని మించిన తనయుడిగా రాష్ట్రం కోసం ప్రజల కోసం నిరంతరం కృషి చేసే వ్యక్తి అన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తిచేసుకున్న కూటమి ప్రభుత్వం ప్రజల్ని మరోమారు మోసం చేసారని ప్రజలు గ్రహించారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూరల్ వైసీపీ కార్యాలయం లో వైయస్ ఆర్ కు నివాళులు



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 8:**
తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం లోని డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు బుధవారం వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల అధ్యక్షతన సేవా కార్యక్రమా లు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వేణుగోపా లకృష్ణ , గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ,వైయస్సార్ అంటే నమ్మకం,
ధైర్యమని పేద ప్రజలకు ఆయన చేసిన మేలు ఎప్పటికీ మరువలేనిదన్నారు.
జగన్ నాయకత్వంలో ఆయన ఆశయాల సాధన కోసం శ్రమిస్తామని అన్నారు. వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ..
నియోజకవర్గంలో పలు చోట్ల నాయకులు ఏర్పాటు చేసిన వేడుకలకు హాజరయ్యారు. దవళేశ్వరం గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్ ,బ్యారేజ్ సెంటర్ వేమగిరి జంక్షన్, కడియపులంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన వేడుకలలో పాల్గొన్నారు.

## ఘనంగా గాదరాడ గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు..

వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు



**కోరుకొండ, పెన్ పవర్, జూలై 8:**గాదరాడ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.
ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం కోసం వైయస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# దళిత క్రైస్తవ సామాజికవర్గం చుట్టూ రాజకీయ చదరంగం

**ఏలూరు, జూలై 8, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఎన్నికల ముగింపు తర్వాత కూడా తెరవెనుక సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో సుమారు 15% నుండి 18% వరకు బలంగా ఉంటూ, దశాబ్ద కాలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత నమ్మకమైన, సహజ సిద్ధమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న దళిత క్రైస్తవ సామాజికవర్గం చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ చదరంగం నడుస్తోంది. మొన్నటివరకు జగన్ మోహన్ రెడ్డికి ఏకపక్షంగా అండగా నిలిచిన ఈ వర్గానికి తానే ఏకైక లీడర్నని, రక్షకుడినని చెప్పుకుంటూ జై భీమ్ భారత్ పార్టీ అధినేత, లాయర్ జడ శ్రవణ్ కుమార్ రంగంలోకి దిగారు. గత ఎన్నికల్లో మంగళగిరితో పాటు పలు స్థానాల్లో సొంతంగా అభ్యర్థులను నిలబెట్టి ఓట్లు చీల్చిన శ్రవణ్.. ఇప్పుడు ఏకంగా తానే దళిత క్రైస్తవుల ప్రత్యామ్నాయ డిప్యూటీ సీఎం అనే రేంజ్‌లో బిల్డప్ ఇస్తూ చేస్తున్న రాజకీయం ఢిల్లీ స్థాయి దాకా చర్చనీయాంశమైంది.రాజకీయ నిపుణుల లోతైన విశ్లేషణ ప్రకారం.. జడ శ్రవణ్ కుమార్‌కు అత్యంత స్పష్టమైన, సుదూర రాజకీయ లక్ష్యాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవుల నిరసన సభలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఆయన చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు దీనికి స్పష్టమైన ఉదాహరణ. పవన్ కల్యాణ్ కాపు సామాజికవర్గానికి డిప్యూటీ సీఎం అయితే.. నేను దళిత క్రైస్తవ సామాజికవర్గానికి డిప్యూటీ సీఎంను అనే తరహాలో శ్రవణ్ క్లెయిమ్ చేసుకోవడం వెనుక.. జగన్ మోహన్ రెడ్డి ఇమేజ్‌ను పక్కనబెట్టి, సదరు ఓటు బ్యాంక్‌ను తన స్వంత అకౌంట్‌లోకి మార్చుకోవాలనే మైండ్ గేమ్ స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో జోసఫ్ రావణ్‌కు మద్దతుగా జడ శ్రవణ్ పని చేశారు. ఇక్కడే వైసీపీ ఊహించని పెద్ద పొలిటికల్ షాక్ తగలనుంది. జోసఫ్ రావణ్, జడ శ్రవణ్ కుమార్ వంటి వారు పవన్ కల్యాణ్‌ను, కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుంటే.. వైసీపీ అనుకూల మీడియా వీరికి విపరీతమైన కవరేజ్ ఇస్తూ ప్రమోట్ చేస్తోంది. కూటమిని ఇబ్బంది పెట్టడానికి వీరు పనికొస్తారని జగన్ మోహన్ రెడ్డి భావిస్తుండవచ్చు. కానీ, పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్న నిజం ఏంటంటే.. వీరిని ఎంతగా ప్రోత్సహిస్తే అంతగా వైకాపాకే భారీ నష్టం వాటిల్లుతుంది. ఎందుకంటే, దళిత క్రైస్తవ సమాజంలో ఒక కొత్త లీడర్‌గా జడ శ్రవణ్ కుమార్ ఎస్టాబ్లిష్ అయితే.. మొదట ఖాళీ అయ్యేది వైసీపీ ఓటు బ్యాంక్ అని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో దళిత, మైనారిటీ వర్గాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో తమకు జరిగిన అన్యాయాలు, నిధుల మళ్లింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని గత ఎన్నికలు నిరూపించాయి. జగన్ మోహన్ రెడ్డి కేవలం ఓట్ల కోసమే తమను వాడుకున్నారనే భావన క్రైస్తవ పెద్దలలో బలంగా నాటుకుంటోంది. అందుకే గత ఎన్నికల్లో కొంత మంది కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ఇలాంటి తరుణంలో జడ శ్రవణ్ కుమార్ రూపంలో ఒక దూకుడున్న దళిత న్యాయవాది, క్రైస్తవ హక్కుల రక్షకుడిగా ప్రచారం పొందితే.. ఆ వర్గాల యువత వైసీపీని వదిలేసి జై భీమ్ భారత్ పార్టీ వైపు మళ్లే అవకాశాలు
100 శాతం ఉన్నాయి. అంటే, కూటమిని దెబ్బతీయడానికి వాడుతున్న ఆయుధమే.. చివరికి వైసీపీ పునాదులనే తవ్వేసే ప్రమాదం ఉంది.వైసీపీ అనుసరిస్తున్న ఈ విధానం కచ్చితంగా భస్మాసుర హస్తం లాంటిదేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జోసఫ్ రావణ్ అరెస్ట్‌ను, ఉపా కేసులను బూచిగా చూపిస్తూ జడ శ్రవణ్ కుమార్ చేస్తున్న సెంటిమెంట్ పాలిటిక్స్ వల్ల.. వైసీపీ తన సొంత ఓటు బ్యాంక్‌పై నియంత్రణ కోల్పోతోంది. పవన్ కల్యాణ్ ఐడెంటిటీని ఎదుర్కొనే క్రమంలో, వైసీపీకి ప్రత్యామ్నాయంగా దళిత క్రైస్తవ సమాజానికి జడ శ్రవణ్‌ను లీడర్‌గా మార్చే ఈ వ్యూహం.. రాబోయే 2029 ఎన్నికల నాటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆయా సామాజికవర్గాల్లో మూడో స్థానానికి పడిపోయేలా చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గోదావరి జిల్లాలకు జగన్

**రాజమండ్రి, జూలై 8, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా కాలానికి ఆ ప్రాంతానికి వెళ్తున్నారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చేసే సత్తా కలిగిన ప్రాంతం అది. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి మొత్తానికి మొత్తం సీట్లు పట్టం కట్టి వైసీపీకి జీరో మార్కులు వేసిన కీలక రాజకీయ స్థావరమది. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు అయిన గోదావరి జిల్లాలలో తమ పర్యటనకు జగన్ శ్రీకారం చుడుతున్నారు. జగన్ ఇప్పటిదాకా రెండేళ్ళ కాలంలో అడపా దడపా పరామర్శలు చేశారు. ఎక్కువగా క్రిష్ణా గుంటూరులలోనే ఆయన పర్యటనలు సాగాయి. మధ్యలో విశాఖ దాకా వచ్చారు. అయితే జగన్ తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి వస్తున్నారు వారితో కలసి ఆందోళన : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జగన్ పర్యటన ఈ నెల 15న ఉండబోతోంది. ఆక్వా రైతులను పరామర్శించి వారి సాధక బాధలను వినేందుకు జగన్ వస్తున్నారు అని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మధ్యనే ఆక్వా రైతులు తమ సమస్యలను జగన్ కి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కలసి తెలియచేశాయి. ఆ సమయంలో వారికి అండగా ఉంటూ వైసీపీ పోరాటం చేస్తుందని జగన్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే జగన్ పర్యటన భీమవరంలో పెట్టుకున్నారు అని అంటున్నార్. ఆక్వా రైతులను టీడీపీ కూటమి ప్రభుతం రెండేళ్ళ కాలంలో ఆదుకోలేదని వైసీపీ విమర్శిస్తోంది. సిండికేట్ యాజమాన్యాలు దళారులు కుమ్మక్కు అయి ఫీడ్ రేట్లు భారీగా పెంచేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్వా రైతులు ఆందోళనలో ఉన్నారని వైసీపీ నేతలు అంటున్నారుఇదిలా ఉంటే ఫీడ్ రేట్లు కొంత తగ్గించినా ఇంకా ఆక్వా రైతులు ఇబ్బందులలోనే ఉన్నారు అని అంటున్నారు. దాంతో ఆక్వా రైతులను స్వయంగా కలసి వారి సాధక బాధకాలను జగన్ వింటారు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ సందర్భంగా ఆక్వా రైతులను ఆదుకునేందుకు వైసీపీ తరఫున కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. వ్యూహం ఇదేనా : ఇదిలా ఉంటే గోదావరి జిల్లాలు వైసీపీని 2024 ఎన్నికల్లో పూర్తి స్థాయిలో దెబ్బేశాయి. దాంతో వైసీపీ అధికారంలోకి రావడం పక్కన పెడితే ప్రతిపక్షంలోకి కూడా వచ్చేందుకు అవసరమైన సీట్లు అందుకోలేకపోయింది. ఈ క్రమంలో రెండేళ్ళ పాలన తరువాత జగన్ గోదావరి బాట పట్టారు అని అంటున్నారు. పోయిన చోటనే వెతుక్కోవాలన్నది రాజకీయ జీవులు చెప్పే మాట. ఆ విషయంలో వైసీపీ అధినాయకత్వం కూడా సరైన దారి ఇదే అని గోదావరి జిల్లాలా బాట పడుతోంది అని అంటున్నారు. ఆక్వా రైతుల సమస్యలనే ఆయుధంగా చేసుకుని కూటమి ప్రభుత్వం మీద గట్టిగానే పోరాటం చేయాలన్నది వైసీపీ ఆలోచనగా చెబుతున్నారు. మరి రాక రాక చాలా కాలానికి భీమవరం వస్తున్న జగన్ కి ఏ విధమైన రిసీవింగ్ ఉంటుంది, వైసీపీకి గోదావరి పల్స్ ఏ విధంగా చిక్కుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

## హైదరాబాద్ లో కార్మిక మంత్రి ప్రజా దర్బారు

**విజయవాడ, జూలై 8, పెన్ పవర్:** సాధారణంగా ఒక రాష్ట్రానికి చెందిన మంత్రులు తమ సొంత నియోజకవర్గాలు లేదా జిల్లా కేంద్రాల్లో ప్రజా దర్బార్‌లు నిర్వహించి సమస్యలను పరిష్కరించడం మనం చూస్తుంటాం. కానీ, ఏపీ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. పక్క రాష్ట్రమైన హైదరాబాద్‌లో ఏకంగా ప్రజా దర్బారుతోపాటు జాబ్ మేళా నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో బిక్షపతి యాదవ్ కళ్యాణ మండపంలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా మంత్రి సుభాష్ వినూత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించారని అంటున్నారు. సాధారణంగా వృత్తి, వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షల మంది ఏపీ వాసులు తమ సొంత రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలు, పరిష్కారాల కోసం చాలా ఇబ్బందులు పడుతుంటారు. చిన్నచిన్న పనుల కోసం హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వెళ్లి ఆ పనులు చేయించుకునేందుకు వ్యయప్రసాలకు గురవుతుంటారు. ఇలాంటి వారి కోసం మంత్రి సుభాష్ చేసిన ప్రయోగం అభినందనలు అందుకుంటోంది. సహజంగా ఎన్నికల సమయంలో ఓటర్లు ఎక్కడ ఉంటే నేతలు అక్కడకు క్యూ కడుతుంటారు. అదేవిధంగా ప్రజలకు పాలన చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటిస్తుంటారు. కానీ, తమ ప్రాంత ప్రజల కోసం పక్క రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా అభినందనీయమే అంటున్నారు. పక్క రాష్ట్రంలో ఒక మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించడం రాజకీయంగా ఒక వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. తమ ప్రాంతీయులు ఎక్కడ ఉన్నా వారికి అండగా ఉంటామనే సంకేతాన్ని పంపడం ద్వారా మంత్రి తన సొంత నియోజకవర్గంలో క్రేజ్ పెంచుకునే ఎత్తుగడ అమలు చేశారని అంటున్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే మంత్రి సుభాష్ ప్రజాదర్బార్, జాబ్ మేళా అంటూ హడావుడి చేస్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏది ఏమైనా, హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ వేడిని పెంచడమే కాకుండా, ప్రజా రవాణా, సంక్షేమ పథకాలపై కూడా చర్చను రేకెత్తించింది, తన ప్రజాదర్బార్ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనను చూసి మంత్రి వాసంశెట్టి సుభాష్ సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోనే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నగరాల్లో నిర్వహించే అవకాశం ఉందని ఆయన సంకేతాలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ తరహా వినూత్న ప్రయత్నాలు ప్రజాసేవలో సరికొత్త ఒరవడికి నాంది పలికే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

## వివాదంలో పులవర్తి...

**తిరుపతి, జూలై 8 పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలు కట్టుబాటు తప్పుతున్నారు. ఆడియో లీకులు, వీడియోలు విడుదలవుతాయని తెలిసి కూడా కొందరు ఎమ్మెల్యేలు ఆవేశంతో చేస్తున్న పనులు పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారు. ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఒక కాంగ్రెస్ నేతతో భూ వివాదంపై రిటైర్డ్ జడ్జిపై బూతు పురాణం సంచలనంగా మారింది. వంద కోట్ల విలువైన భూమి విషయంలో తలెత్తిన వివాదమే ఈ ఫోన్ కాల్ సారాంశం. అయితే గత వైసీపీ ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణలు టీడీపీ అధినేత చంద్రబాబు చేశారో అదే తప్పిదం ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ కనపడుతున్నాయి. దీంతో రెండు ప్రభుత్వాలకు పెద్దగా తేడా ఏముందన్న ప్రశ్నలు జనాల్లో మెదులుతున్నాయి.పులివర్తి నాని తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అదీ చంద్రబాబు తొలిసారి పోటీ చేసి రాజకీయాల్లోకి వచ్చిన చంద్రగిరి నియోజకవర్గంలో గెలిచి సత్తా చాటారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ టీడీపీకి గెలుపు దక్కలేదు. అలాంటి నియోజకవర్గంలో 2024లో పులివర్తి నాని ఆ బ్యాడ్ రికార్డును బద్దలు కొట్టి అందరి దృష్టిలో పడ్డారు. అక్కడ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గత కొన్ని ఎన్నికలుగా గెలుస్తూ వస్తున్నారు. చంద్రగిరి తన అడ్డాగా చెవిరెడ్డి భావించారు. అలాంటి చోట గెలిచిన పులివర్తి నాని చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. అయితే ఈ భూ వివాదంలో ఎందుకు ఇరుక్కున్నారన్నది ఇప్పటికీ టీడీపీ నాయకత్వానికి అర్థం కాని ప్రశ్నగానే ఉండిపోయింది. చంద్రబాబు, లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడినపులివర్తి నాని చంద్రగిరిలో తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేయాల్సి ఉంది.కానీ పులివర్తి నాని తొలిసారి గెలిచిన తర్వాత వివాదాల్లో చిక్కుకోవడం ఇప్పుడు పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. ఒక కుటుంబానికి చెందిన భూమిని రికార్డులు తారుమారు చేసి అక్రమించారంటూ ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ స్థలం తమదేనని పులివర్తి నాని వర్గీయులు వాదిస్తున్నారు. తిరుపతిలో కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవ సభవిజయవంతం కావడం చూసి ఓర్వలేక కొందరు ఇలా పులివర్తి నానిపై కుట్రలు పన్నుతున్నారని కూడా వారు ఆరోపిస్తున్నారు. కానీ అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. ఒక వృద్ధ దంపతులు మీడియా ముందుకు రావడం, రిటైర్డ్ ఆర్డీవో కూడా ప్రెస్ మీట్ పెట్టి మరీ విషయాలను వెల్లడించడంతో టీడీపీకి ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబు సొంత జిల్లాలోనే భూ వివాదాలకు టీడీపీ నేతలు కేరాఫ్ గా మారుతుండటం కొంత పార్టీకి ఇబ్బందికరమైన పరిణామమేనని సీనియర్ నేతలు కూడా అంటున్నారు. మరి రానున్న కాలంలో ఎలాంటి పరిణామాలు జరుగుతాయన్నది చూడాలి.

# పవన్ హోమ్ మంత్రి..?

**విజయవాడ, జూలై 8, పెన్ పవర్:**
ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో అనుచిత ప్రవర్తనను అదుపు చేయాలనే ఉద్దేశంతో ఉన్న ప్రభుత్వం ఉగ్రవాదులపై ప్రయోగించే ఉపా చట్టాన్ని వాడుకోవడం సంచలనంగా మారింది. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గతంలో ఎప్పుడూ ఇంత కఠిన నిర్ణయాలు తీసుకోలేదని, ఇప్పుడు సాధారణ కేసులలో కూడా విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని చర్చ జరుగుతోంది. చంద్రబాబు ఇలా మారడానికి కారణాలు ఏమైవుంటాయని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని, అందుకే సీఎం కూడా తన ప్రసంగాల్లో పవన్ పై జరుగుతున్న దాడిని ప్రస్తావిస్తూ తన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలకు వివరిస్తున్నారని అంటున్నారు. దేశ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేత అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశ్చర్యకరంగా పవన్ ప్రభావంతో నిర్ణయాలు తీసుకోవడం ఏంటి? అన్నదే ప్రస్తుతం పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద సార్లు ఆలోచించే చంద్రబాబు, తన 4.0 సర్కారులో మాత్రం కొన్ని అంశాల్లో జోరు చూపిస్తుండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. ఇందులో ప్రధానంగా సోషల్ మీడియా కేసుల విషయంలో చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రత్యర్థులను కూడా విస్మయానికి గురిచేస్తున్నాయని చెబుతున్నారు.రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న చంద్రబాబుకు తొలి రెండు విడతలు సాఫీగా సాగిపోయాయి. అప్పట్లో సోషల్ మీడియా ప్రభావం లేకపోవడంతో చంద్రబాబు రాజకీయాలు ఒక మోస్తరుగా సాగిపోయేవి అని చెబుతున్నారు. అయితే 2014లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక సోషల్ మీడియా నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న చంద్రబాబు అధికారంలో



ఉన్నంత వరకు అవేవీ తనను ఇబ్బంది పెట్టే సమస్యగా భావించలేదని అంటున్నారు. దీంతో అప్పట్లో అంటే 2014-19 మధ్య చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలో పనిచేసిన వారిపై సోషల్ మీడియాలో ఎంతలా దాడి చేసినా పెద్దగా పట్టించుకోలేదని, పోలీసు కేసులు కూడా పెద్దగా పెట్టలేదని అంటున్నారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఈ పరిస్థితిలో పూర్తి మార్పు కనిపిస్తోందని చెబుతున్నారు 2024 జూన్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నాళ్లు సోషల్ మీడియా పోస్టులపై ఉదాసీనంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ స్ట్రాంగ్ రియాక్షన్ తో కేసుల నమోదుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. తనతోపాటు కుటుంబ సభ్యులపైన అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదని పవన్ అసంతృప్తి వ్యక్తం చేసిన తర్వాత వరుసపెట్టి కేసులు నమోదు చేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురిని అరెస్టు చేయడం గమనిస్తే ప్రభుత్వంపై పవన్ ఒత్తిడి ఎక్కువగానే ఉందన్న విషయం అర్థమవుతోందని అంటున్నారు. ప్రస్తుతం యూట్యూబర్ రావణ్ అరెస్టు ముందు కూడా 'తాను హోంమంత్రి అయితే' అంటూ పవన్ సోషల్ మీడియా కార్యకర్తలను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆ తర్వాత రావణ్ అరెస్టు జరగడం, వరుసగా బెయిలు వస్తున్న దశలో ఉపా చట్టం ప్రయోగించడం చూస్తే ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందనే విషయం అర్థమవుతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తన మిత్రుడిని కాపాడుకోవడం కోసం సీఎం చంద్రబాబు ఇంతటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడమే అంతుచిక్కడం లేదని అంటున్నారు.

నాన్చుడు ధోరణితో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తారని, ప్రతివిషయాన్ని భూతద్దంలో చూస్తారని టీడీపీ కార్యకర్తలు సైతం విమర్శిస్తుంటారని చెబుతారు. కానీ, పవన్ విషయంలో చంద్రబాబు నాన్చుడు ధోరణికి స్వస్తి చెప్పడమే కాకుండా, ఆఘమేఘాలపై నిర్ణయాలు తీసుకోవడం, యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం చూస్తే ఉప ముఖ్యమంత్రికి ప్రభుత్వంలో ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతోందని అంటున్నారు. అయితే ఇలాంటి కఠిన నిర్ణయాలు ప్రభుత్వానికి మంచి చేస్తాయా? లేదా? అన్న విషయమై సీఎం ఆలోచన చేస్తున్నారో? లేదో? కూడా తెలియడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# కాపు నేతల్లో పరుగు పందెం

**కాకినాడ, జూలై 8, పెన్ పవర్:**
వైసీపీ కాపు సామాజికవర్గం నేతల్లో పోటీ ఎక్కువ కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో గెలవడమే కాకుండా పార్టీ అధికారంలోకి వస్తే తమకు కేబినెట్ పదవి దక్కుతుందన్న భావన చాలా మందిలో వ్యక్తమవుతుంది. అందుకే వైసీపీ లో ఇప్పుడు కాపు సామాజికవర్గం నేతల వాయిస్ మాత్రమే గట్టిగా వినిపిస్తుంది. మిగిలిన సామాజికవర్గం నేతలు పెద్దగా కనిపించడం లేదు. గతంలో మంత్రులుగా పనిచేసిన రెడ్డి, ఎస్.సి, ఎస్టీ, కమ్మ సామాజికవర్గం నేతలు కూడా వైసీపీ తరుపున బయటకు వచ్చి మాట్లాడటం లేదు కానీ.. కాపు సామాజికవర్గం నేతలు మాత్రం హైలెట్ కావడానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం వచ్చే ఎన్నికల్లో గెలిస్తే పదవి కోసమేనన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తుందివైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కాపు సామాజికవర్గం నేతలకు జగన్ తన కేబినెట్ లోఅవకాశం కల్పించారు. బొత్స సత్యనారాయణ, కన్నబాబు, అంబటి రాంబాబు, పేర్ని నాని, ఆళ్ల నాని వంటి వారు మంత్రి పదవిని జగన్ మంత్రివర్గంలోపొందారు. ఆళ్ల నాని పార్టీ నుంచి వెళ్లిపోయినా మిగిలిన నేతలుమాత్రం పార్టీలోనే ఉండిపోయారు. ఎవరూ ఇతర పార్టీల్లోచేరేందుకు కూడా ప్రయత్నించలేదు. సహజంగా జనసేన లోకి వెళ్లాల్సిన నేతలు కూడా వైసీపీలోనే ఉండిపోయారు. ఇక వెళ్లే అవకాశం కూడా లేకపోవచ్చు. అయితే ఇదే సమయంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీ కాపు నేతల్లోనే పదవి కోసం రేసు మొదలయినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా చూసిన వారికి ఎవరికైనా ఇదే భావన అనిపించక మానదు. . వైసీపీ ఓటమి పాలయి పదకొండు సీట్లకే పరిమితమయిన తర్వాత కాపు నేతలే ఎక్కువ గళం విప్పుతున్నారు. ఇక ఇటీవల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా హైలెట్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. తోట త్రిమూర్తులు సీనియర్ నేత. అందుకే ఆయన ఇటీవల తన ఇలాకాలో వైసీపీ కాపు నేలత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జగన్ దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. అందులో తోట త్రిమూర్తులు సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ముద్రగడ పద్మనాభం వంటి నేతలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో తోట త్రిమూర్తులు కాపు సామాజికవర్గాన్ని వైసీపీకి దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద వైసీపీలో ఇతర సామాజికవర్గాల కంటే కాపు సామాజికవర్గం నేతల హడావిడే ఎక్కువగా కనిపిస్తుంది. మరి కాపు నేతల్లో ఎవరు రేసులో ముందుంటారన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

**మండలిది అదే బాట...**
అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు రాజకీయ వైరాగ్యం వచ్చింది. ఆయన గత ఎన్నికల్లో తాను పోటీ చేసి తప్పు చేశానని బాధపడుతున్నారు. నిజానికి తాను గెలిచి తప్పు చేశానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనడం ఏపీ రాజకీయాలకు అద్దం పడుతుంది. నిజానికి మండలి బుద్ధ ప్రసాద్ సౌమ్యుడు. ఆయన ఎవరినీ నొప్పించరు. ఒకరిని మాట తూలే వ్యక్తి కాదు. నాయకుల్లో విభిన్నమైన నేతగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కు పేరుంది. ఆయన తండ్రి మండలి వెంకట కృష్ణారావు నుంచి నేర్చుకున్న రాజకీయ పాఠాలు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను రాజకీయంగా ఇంత వరకూ తీసుకు వచ్చాయి.తెలుగు భాషను కాపాడుకోవడం కోసం దశాబ్ద కాలం నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోఆయనకు మంచి పేరుంది. అవినీతి, ఆరోపణలకు దూరంగా ఉంటారు. ఆయన రాజకీయ జీవితంలో ఇప్పటి వరకూ చిన్న మచ్చ లేదు. కాకుంటే ఒకటే. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనేక పార్టీలుమారారు. కాంగ్రెస్ లోఉన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తర్వాత టీడీపీలోచేరారు.
2014 లోటీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నాడు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా పనిచేశారు. అయితే గత ఎన్నికలకు ముందు ఆయనకు టిక్కెట్ ఇబ్బందికరం కావడంతో జనసేనలోకి మారారు. ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అవనిగడ్డ నియోజకవర్గంలో సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఆయన ఎదుర్కొంటున్నారు బహుశ అదే ఆయనను బాధించి ఉండవచ్చంటున్నారు. తనకన్నా రాజకీయంగా తక్కువ అనుభవం ఉన్న నేతలతో పాటు వయసు కూడా తక్కువ ఉన్న వారు తనను విమర్శించడం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తట్టుకోలేకపోతున్నారు. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కూడా వ్యక్తిగత విమర్శలకు వేదికగా మారడం ఆయనను మరింత బాధించినట్లుంది. అందుకే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తాను రాజకీయాల్లో ఎందుకున్నానో అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈసారి ఎమ్మెల్యేగా గెలవడమే పెద్ద తప్పు చేశానని మండలి బుద్ధప్రసాద్ అన్నారంటే ఎంత వేదన చెందారో అర్థం చేసుకోవచ్చు. దిగజారిన రాజకీయ విలువలను చూసి రోజూ బాధపడుతున్నానని మండలి బుద్ధప్రసాద్ అన్నారంటే అందుకు గల కారణాలు నేటి తరం రాజకీయ నేతలు తెలుసుకోవాల్సి ఉంటుంది.

# భారత్ వరుస ఓటములు.. కన్నీరు పెట్టుకున్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తోని ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరిగిన మూడో టీ20ల మన టీమిండియా మస్తు దారుణంగా ఓడిపోయింది. పరుగుల పరంగా చూస్తే టీ20 చరిత్రలనే ఇది ఇండియాకు అత్యంత ఘోరమైన ఓటమి. రీసెంట్‌గానే టీ20 వరల్డ్ కప్ గెలిచిన మనోళ్లు.. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్లు జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ వేసిన 90 ఎజూప్త్ర (145 ఎెప్త్ర) బుల్లెట్ బాల్స్‌కు ఏం చేయాలో తెలియక చేతులెత్తేసింగ్రు. ఈ దెబ్బతోటి 5 మ్యాచ్‌ల సిరీస్‌ల ఇంగ్లాండ్ 2-0 తో తిరుగులేని లీడ్‌లోకి వెళ్ళిపోయింది.

**ఆట అస్సలు ఒప్పుకోలేం: శ్రేయస్**

మ్యాచ్ ముగిసినంక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. మేము చాలా దారుణంగా ఆడినం.. అంటు స్టేడియంలోనే కన్నీరు పెట్టుకునేంత పని చేశాడు. 125 పరుగుల భారీ మార్జిన్‌తోని ఓడిపోవడం అస్సలు జీర్ణించుకోలేకపోతున్నాం.. వికెట్ మీద బౌలర్లకు లెంత్ హెల్ప్ అయింది, కానీ మావాళ్లు ప్లాన్స్ సరిగ్గా అమలు చేయలేదు.. రన్ చేజ్ చేసేటప్పుడు ఒక పద్ధతి ఉండాలి.. మా ప్లానింగ్ మొత్తం దారుణంగా ఫెయిల్ అయిందన్నాడు.

**పవర్‌ప్లేలనే డగౌట్ కి క్యూ:**

ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ చేసి 201-7 భారీ స్కోరు కొట్టింది. వాళ్ల ఓపెనర్ ఫిల్ సాల్ట్ (70 రన్స్) ఒక్కడే కొట్టిన స్కోరును.. టీమ్ మొత్తం కలిసి కూడా దాటలేక ఖపోయింది. 12 ఓవర్లు కూడా తిరక్కుండానే ఇండియా 76 పరుగులకే ఆలౌట్ అయింది. 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని ఆర్చర్ ఒక 90 ఎజూప్త్ర బౌన్సర్‌తో భయపెట్టిండు, ఆ నెక్స్ట్ బాలే అతడు సిక్స్ కొట్టినా.. ఆ తర్వాత ఆర్చర్ వేసిన బౌన్సర్‌కే కీపర్ క్యాచ్ ఇచ్చి అవుట్ అయిండు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, కెప్టెన్ అయ్యర్, అక్షర్ పటేల్.. అంతా క్యూ కట్టేసరికి 5 ఓవర్లకే ఇండియా 25 రన్స్ కే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత తిలక్ వర్మ స్టంపౌట్ కాగా.. హోమ్ గ్రౌండ్‌ల ఆడుతున్న జోష్ టంగ్ (4--28) శివమ్ దూబే, హర్షిత్ రాణాలను అవుట్ చేసి కెరీర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చిండు. భారత్ తన లోయెస్ట్ స్కోరు (74 రన్స్) ను దాటితే చాలు అన్నట్టుగా బ్యాటింగ్ చేసింది.

**హ్యారీ బ్రూక్ సేన హవా:**

ఇంకోవైపు ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాత్రం ఫుల్ ఖుషీగా ఉన్నాడు. సాల్ట్ కిరాక్ ఇన్నింగ్స్ ఆడిండు. ఇలాంటి వికెట్ మీద 200ం కొట్టడం మామూలు ముచ్చట కాదు.. మా బౌలర్లకు మేమేం పెద్దగా ఏం చెప్పలేదు.. టాప్ ఆఫ్ ది స్టంప్స్ హిట్ చేయమన్నం, మధ్య మధ్యలో బౌన్సర్లు వేయమన్నం.. ఆ సింపుల్ ప్లాన్ పక్కా వర్కవుట్ అయిందని బ్రూక్ చెప్పుకొచ్చాడు.

**బ్రిస్టల్‌లో డూ ఆర్ డై మ్యాచ్:**

గత నెలల ఐర్లాండ్‌తోని సిరీస్ ఓడిపోయిన మనోళ్లకు, ఇదో పెద్ద షాక్. ఈ ఘోర పరాజయం 2019లో న్యూజిలాండ్‌పై ఎదురైన 80 రన్స్ ఓటమి రికార్డును కూడా తుడిచేసింది. ఇక గురువారం బ్రిస్టల్‌ల జరిగే నాలుగో టీ20లో ఇంగ్లాండ్ గెలిస్తే సిరీస్ వాళ్ల సొంతమవుతుంది.

కానీ శ్రేయస్ అయ్యర్ మాత్రం ఇంకా హోప్స్ వదులుకోలేదు. స్ట్రాంగ్‌గా కమ్‌బ్యాక్ ఇవ్వడానికి ఇదో మంచి ఛాన్స్.. జరిగిపోయిన దాన్ని పట్టుకొని ఏడవడం కంటే.. దారుణంగా ఆడినా కూడా ఈ మ్యాచ్ నుంచి నేర్చుకోవాల్సింది మస్తు ఉందని చెప్పుకొచ్చాడు. మరి నెక్స్ట్ మ్యాచ్‌లైనా భారత్ పుంజుకుంటుందో లేదో..

# ఇది ఫుట్‌బాలా.. ఫిక్సింగా?.. అర్జెంటీనాకే వరల్డ్‌కప్ ఇచ్చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లల్లా ఈజిప్ట్ జట్టు 78వ నిమిషం దాకా 2--0తో ఫుల్ లీడ్‌ల ఉండె.. కానీ ఆ తర్వాత అర్జెంటీనా కమ్‌బ్యాక్ ఇచ్చి 3--2తో మ్యాచ్‌ను గుంజేసుకుంది. అయితే ఈ మ్యాచ్ ముగిసినంక ఈజిప్ట్ కోచ్ హొస్సామ్ హసన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో దారుణంగా తిట్టిపోసిండు. రెఫరీ, VAR (వీడియో అసిస్టెంట్ రెఫరీ) టీమ్ కలిసి కావాలనే అర్జెంటీనాకు ఫేవర్‌గా నిర్ణయాలు ఇస్తూ.. వాళ్లు గెలవడానికి గేట్లు బారేడు తెరిచారని ఆరోపించిండు. మ్యాచ్‌లో చాలా నిర్ణయాలు అర్జెంటీనాకే ప్లస్ అయినా.. ఈ రెండు పెద్ద నిర్ణయాలు మాత్రం ఈజిప్ట్ కొంపముంచినాయి.

**వెనక్కి పోయి మరి ఈజిప్ట్ గోల్‌ను రద్దు చేస్తారా?:**

ఈజిప్ట్ 1--0 లీడ్‌ల ఉన్నప్పుడు.. వాళ్ల మిడ్‌ఫీల్డర్ మోస్తఫా జికో ఒక అదిరిపోయే కౌంటర్ ఎటాక్‌తోని అదిరిపోయే గోల్ కొట్టిండు. నిజానికి ఆ గోల్ ఇచ్చుంటే ఈజిప్ట్ 2--0తో సేఫ్ జోన్‌లోకి వెళ్లేది. కానీ రెఫరీ ఫ్రాంకోయిస్ లెటెక్సియర్‌ను వా= టీమ్ స్క్రీన్ చూసుకోమని పిలిచింది. ఆ గోల్ కొట్టడానికి ఓ 10 సెకన్ల ముందు, అండ్ 100 గజాల దూరంలో (ఈజిప్ట్ హాఫ్‌లో) అర్జెంటీనా ప్లేయర్ లిసాండ్రో మార్టినెజ్ కాళ్లను ఈజిప్ట్ మిడ్‌ఫీల్డర్ మర్వాన్ అత్తియా తొక్కిండు, షర్ట్ లాగిండు అని సాకు చూపించారు.

**ఈజిప్ట్ ఫ్యాన్స్ ఆగ్రహం:**

అర్జెంటీనా ఎటాక్ చేస్తున్నప్పుడు ఈజిప్ట్ డిఫెండర్లు బాల్‌ను లాక్కుని, గ్రౌండ్ మొత్తం పరిగెత్తుకుంటూ పోయి గోల్ కొడితే.. ఎక్కడో వంద గజాల వెనక జరిగిన చిన్న ఫౌల్‌ను పట్టుకొని గోల్ క్యాన్సిల్ చేయడం ఏంటని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. జికో ఆ తర్వాత కొద్దిసేపటికే ఎలాగోలా ఇంకో గోల్ కొట్టి 2--0 చేసినా.. ఒకవేళ ఆ ముందటి గోల్ ఇచ్చి ఉంటే ఈజిప్ట్ 3-0తో మ్యాచ్‌ను గెలిచేది.

**సలాహ్‌ను కింద పడేసినా పెనాల్టీ ఇవ్వరా: ఈజిప్ట్**

మ్యాచ్ లాస్ట్ స్టేజ్‌కి వచ్చేసరికి ఈజిప్ట్ మళ్లీ పుంజుకునేందుకు ట్రై చేసింది. ఆ టైమ్‌లో అర్జెంటీనా పెనాల్టీ బాక్స్‌లో ఈజిప్ట్ స్టార్ ప్లేయర్ మొహమ్మద్ సలాహ్‌ను జూలియన్ అల్వారెజ్ పక్కాగా షర్ట్ పట్టి లాగిండు, అతడి కాలును కూడా తొక్కి కింద పడేసిండు. ఈజిప్ట్ ప్లేయర్లు పెనాల్టీ కోసం గట్టిగనే డిమాండ్ చేశారు. రెఫరీ కళ్లముందే అంత పెద్ద ఫౌల్ జరిగినా ఆటను కంటిన్యూ చేయమన్నాడు. పోనీ వా= టీమ్ అయినా చెప్తదా అంటే.. వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు. ఈజిప్ట్ కొట్టిన గోల్ అప్పుడు వెనక్కి వెళ్లి మరీ ఫౌల్ వెతికిన VAR.. ఇక్కడ సలాహ్‌ను పెనాల్టీ బాక్స్‌లో అంత క్లియర్‌గా షర్ట్ లాగి పడేసినా పట్టించుకోకపోవడంతోపై సీరియస్ అవుతున్నారు.

**ఈజిప్ట్ గుండె పగిలింది.. అర్జెంటీనా విన్నింగ్ గోల్:**

అర్జెంటీనా ప్లేయర్లు పదే పదే ఫౌల్స్ చేస్తున్నా రెఫరీ కనీసం కార్డ్స్ కూడా ఇవ్వకుండా వదిలేసిండు. దీనికి సంబంధించిన ఒక వీడియో కంపైలేషన్ కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తమకు రావాల్సిన పెనాల్టీని అన్యాయంగా రద్దు చేయడంతో ఈజిప్ట్ క్యాంప్ మొత్తం తీవ్ర నిరాశలోకి వెళ్ళిపోయింది. ఆ బాధలో వాళ్లు ఉండగానే.. ఇంజూరీ టైమ్‌లో అర్జెంటీనా ప్లేయర్ ఎంజో ఫెర్నాండెజ్ విన్నింగ్ గోల్ కొట్టి ఈజిప్ట్ గుండె పగిలేలా చేసిండు. అర్జెంటీనా క్వార్టర్స్‌కు పోయినా.. ఈ మ్యాచ్ లొల్లి మాత్రం వరల్డ్ కప్ చరిత్రలనే వన్ ఆఫ్ ది మోస్ట్ కాంట్రవర్షియల్ మ్యాచ్‌గా నిలిచిపోయింది.

# హర్షిత్ రాణాతో అంత రిస్క్ అవసరమా గంభీర్?.. దినేశ్ కార్తీక్ ఫుల్ ఫైర్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తోని జరిగిన మూడో టీ20లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వేసిన ఒక వింత ప్లాన్ (స్ట్రాటజీ) చూసి.. మాజీ క్రికెటర్, కామెంటేటర్ దినేష్ కార్తీక్ (ఱఖ) ఫుల్ గరం అయ్యాడు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలోని ఇంగ్లాండ్ టీమ్ మన భారత జట్టు బ్యాటింగ్ లైన్ అప్‌ను ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఘోరంగా దెబ్బకొట్టింది.

**పవర్‌ప్లేలనే తుస్సుమన్న టాప్ ఆర్డర్:**

మ్యాచ్ స్టార్ట్ అయిందో లేదో.. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి ఇండియన్ బ్యాటర్లు ఒకరి వెనుక ఒకరు డగౌట్ కి క్యూ కట్టింగ్రు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్.. ఈ ఐదుగురు ప్లేయర్లు మొదటి 6 ఓవర్లనే పెవిలియన్ బాట పట్టింగ్రు. దీంతో టీమిండియా తీవ్ర కష్టాల్లో పడిన సమయంలో హెడ్ కోచ్ గంభీర్ అసలు ఎవరు ఊహించని ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఆల్‌రౌండర్ శివమ్ దూబే కంటే ముందే ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాను బ్యాటింగ్‌కు పంపించిండు.

**అతడు పవర్‌ప్లేలో ఆడలేదు: డీకే ఫైర్**

ఈ వింత ప్రయోగం చూసి దినేష్ కార్తీక్ కామెంట్రీ బాక్స్ నుంచే కోచ్ గౌతమ్ గంభీర్ ని గట్టిగనే ప్రశ్నించిండు. శివమ్ దూబే కంటే ముందే హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడం ఏంది.. మీరు ఏమైనా జోకులు వేస్తున్నారా? నాకు తెలిసి హర్షిత్ రాణా డొమెస్టిక్ క్రికెట్‌లో కూడా ఎప్పుడూ పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేయలేదు.. టీ20 క్రికెట్‌లో రైట్-లెఫ్ట్ కాంబినేషన్ వర్కవుట్ చేయొచ్చు, కానీ దానికి కూడా ఒక లిమిట్ ఉంటది. అంతేకాని దూబే కంటే ముందు రాణాను బ్యాటింగ్ కి పంపడం ఏ మాత్రం కరెక్ట్ కాదని ఫుల్ ఫైర్ అయ్యాడు.

**భారత్ సిరీస్ గెలిచే అవకాశం లేదు:**

టాప్ ఆర్డర్ దారుణంగా ఫెయిల్ కావడంతో, టీమిండియా చరిత్రలోనే వన్ ఆఫ్ ది వరస్ట్ బ్యాటింగ్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది. ట్రెంట్ బ్రిడ్జ్ మ్యాచ్‌లో ఇండియా కేవలం 76 పరుగులకే ఆలౌట్ అయింది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్ చరిత్రలోనే ఇది భారత్ కు రెండో అత్యల్ప స్కోరు. 125 పరుగుల తేడాతో గెలిచిన ఇంగ్లాండ్ టీమ్ ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ని 2--0తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఫస్ట్ విక్టరీ కోసం చూస్తున్న భారత్.. ఈ సిరీస్ గెలిచే ఛాన్స్‌ను చేజేతులా పోగొట్టుకుంది.

**ఆ రెండు మ్యాచ్‌లు గెలవాల్సిందే:**

ఇగ వరుసగా సిరీస్‌లు ఓడిపోకుండా ఇజ్జత్ కాపాడుకోవాలంటే.. టీమిండియా మిగిలిన రెండు మ్యాచ్‌లను పక్కా గెలవాల్సిందే. ఇంకోవైపు ఇంగ్లాండ్ టీమ్ నెక్స్ట్ మ్యాచ్ గెలిస్తే చాలు.. సిరీస్‌ను కైవసం చేసుకుంటది. మరి బ్రిస్టల్‌లో జరిగే మ్యాచ్‌లైనా గంభీర్ ఇలాంటి వింత ప్రయోగాలు ఆపుతాడో లేదో చూడాల్సి ఉంది.

# శృతి హాసన్ స్టన్నింగ్ లుక్.. బ్యాక్ ఫోజులతో..



రిద్ధి కుమార్ మిర్రర్ సెల్ఫీలో ఆత్మవిశ్వాసం, స్టైల్ ఉట్టిపడుతున్నాయి

మల్టీటాలెంటెడ్ స్టార్ శృతి హాసన్ తన సరికొత్త ఫొటోషూట్‌తో నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. ట్రెడిషనల్ వేర్‌లో రాయల్ లుక్‌ను తలపిస్తూ ఆమె దిగిన కొన్ని ప్రత్యేకమైన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ, ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా తన గ్లామరస్ అప్‌డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్‌కు నిరంతరం టచ్‌లో ఉంటోంది. ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న ఆమె లేటెస్ట్ ఎలిగెంట్ లుక్ విశేషాలు చూద్దాం..

**శృతి రాయల్ లుక్ సీక్రెట్:**

ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో శృతి హాసన్ లుక్ ఎంతో రిచ్‌గా, క్లాసీగా ఉంది. ఆమె జిగేల్‌మనే జిలుగు వెలుగుల సేజ్ గ్రీన్ కలర్ సారీని ధరించారు. ఇక బాడీకి పర్‌ఫెక్ట్‌గా సెట్ అయిన ఈ శారీపై ఎంతో అద్భుతమైన డిజైన్స్, ఇంట్రికేట్ ప్యాటర్న్లు ఉన్నాయి. ఇక దీనికి మ్యాచింగ్ బ్లౌజ్‌ను జత చేసి ఆమె ఇచ్చిన రాయల్ పోజ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ క్లాసిక్ శారీ స్టైలింగ్‌ను ప్రశ్వేత్ డిజైన్ చేయగా.. మీరా అటైర్ బ్లౌజ్ డిజైన్‌ను అందించారు.

**మెస్మరైజ్ చేస్తున్న ఎమరాల్డ్ జ్యువెలరీ:**

ఈ రాయల్ శారీ లుక్‌కు తోడు ఆమె పెట్టుకున్న జ్యువెలరీ సినిమాకు మెయిన్ హైలైట్‌లా నిలిచింది. తారాస్య సిల్వర్ జ్యువెలరీ అందించిన స్టేట్‌మెంట్ ఎమరాల్డ్ పచ్చల నగలు శృతి అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఇక దీనికి తోడు చాలా సింపుల్‌గా హెయిర్ స్టైల్, క్లాసీగా ఉన్న ఫ్లావలెస్ మేకప్ ఆమె ముఖ కవళికలను ఎంతో అందంగా ఎలివేట్ చేశాయి. ఇక ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో మోడ్రన్ టచ్ ఇస్తూ మెగ్లియో బ్రాండ్ కి సంబంధించిన ఫుట్‌వేర్‌ను ఆమె మ్యాచ్ చేశారు.

**వైవిధ్యమైన నటన.. సింగర్‌గా స్పెషల్ క్రేజ్:**

శృతి హాసన్ కేవలం నటి మాత్రమే కాదు, ఆమె ఒక అద్భుతమైన సింగర్, మ్యుజీషియన్ కూడా. గతంలో ఆమె రిలీజ్ చేసిన పలు సింగిల్స్ మ్యూజిక్ లవర్స్‌ను ఎంతగానో అలరించాయి. ఇక సినిమాల విషయానికి వస్తే.. తమిళ్‌లో 7అమ్ అరివు, హిందీలో డి-డే చిత్రాలతో పాటు గబ్బర్ ఈజ్ బ్యాక్, వేదాళం, వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తన వర్సటాలిటీని నిరూపించుకున్నారు. ఇక నటనతో పాటు మ్యూజిక్ కెరీర్‌ను కూడా ఆమె అంతే పర్‌ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తున్నారు.



**'పెద్ది' ఐటెం సాంగ్ నుండి 'సలార్ 2' వరకు:**

గత కొంతకాలంగా సినిమాల ఎంపికలో శృతి చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తక్కువ సినిమాలు చేస్తున్నా.. అందులో ఇంపాక్ట్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిసి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఇక ప్రస్తుతం ప్రభాస్ హీరోగా రాబోతున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'సలార్ 2' లో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

**ఫ్యాషన్ ప్రియులకు పర్‌ఫెక్ట్ ఇన్‌స్పిరేషన్:**

శృతి హాసన్ చేసిన ఈ సరికొత్త ట్రెడిషనల్ ఫొటోషూట్ శారీ లవర్స్‌కు మరియు ఫ్యాషన్ ప్రియులకు ఒక పర్‌ఫెక్ట్ ఇన్‌స్పిరేషన్ అని చెప్పొచ్చు. ట్రెడిషనల్ శారీలో కూడా ఇంత గ్లామరస్‌గా, ఎలిగెంట్‌గా ఎలా కనిపించవచ్చో ఆమె మరోసారి ప్రూవ్ చేశారు. ఇక ప్రస్తుతం చేతిలో ఉన్న క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్టులతో శృతి రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలని ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు..



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965